క్లుప్తంగా

ఉద్యోగాలకు 75 మంది విద్యార్థులు ఎంపిక



తెనాలి: స్థానిక ఎస్ఆర్‌కే అండ్ కేఎస్సార్ గుప్తా డిగ్రీ కాలేజీ, కె.చంద్రకళ పీజీ కాలేజీ సంయుక్తంగా గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు 200 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 75 మందికి ఉద్యోగాలు లభించినట్టు తెలియజేశారు. ఫాక్స్‌కాస్ కంపెనీకి 25 మంది, క్వెస్ కంపెనీకి 25, శ్రీవిజయ బయోఫర్టిలైజర్స్‌కు మరో 25 మంది చొప్పున డిగ్రీ, పీజీ ఫైనలియర్ విద్యార్థులు ఎంపికై నట్టు తెలిపారు. మరికొన్ని కంపెనీల్లో తొలిదశ ఇంటర్వ్యూలో నెగ్గి, రెండో రౌండ్‌కు 80 మంది అర్హత సాధించినట్టు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులను పొట్టి శ్రీరాములు ఎడ్యుకేషనల్ సొసైటీ యాజమాన్యం తరఫున నంబూరు నరేంద్ర అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు గోగినేని విజయకృష్ణ, నరేష్, షారోన్ లిల్లీ, నాగరాజు, కోటేశ్వరరావు, ఎం.దశరథరామిరెడ్డి, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



తెనాలిటౌన్: శాసన మండలి సభ్యుల ఎన్నిక విధానంపై అవగాహన కలిగి ఉండాలని వీఎస్సార్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఎమ్మెల్సీ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ పాల్గొని ఓటు హక్కు విధానంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు కె.రవీంద్రనాథ్, అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటి దత్తహోమానికి విస్తృత ఏర్పాట్లు



తెనాలిరూరల్: తెనాలి మండలం పెదరావూరులోని శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమం అవధూత దత్త పీఠంలో ఈ నెల 22 నుంచి 24 వరకు కోటి దత్త హోమాలు నిర్వహించనున్నారు. ఆశ్రమంలోని 18 అడుగుల ఏకరాతి ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద లోక కళ్యాణార్థం నవకోటి దత్త హోమాల నిర్వహణలో భాగంగా కోటి దత్తహోమం జరుగుతుందని నిర్వాహకులు చెప్పారు. గురువారం అక్కడి ఏర్పాట్లను ఉప్పల వరదరాజులు, కన్యాకుమారి, శివతేజ, డాక్టర్ గవిని రాజేంద్ర, పుచ్చా విజయ్ కుమార్ తదితరులు పరిశీలించారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భక్తులందరూ పాల్గొనాలని సూచించారు. భక్తులందరూ పాల్గొనే విధంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలకు బీరువా అందజేత



తెనాలిటౌన్: దాతల సేవా నిరతి అభినందనీయమని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం టి.శ్రీధర్ కొనియాడారు. రూరల్ మండలం కఠెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం గ్రామానికి చెందిన దాతలు బీరువా బహూకరించారు. కొచ్చెర్ల రాజారావు, బుల్లెమమ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు హెచ్ఎం తెలియజేశారు. పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై 6ఏ కేసు నమోదు

చెరుకుపల్లి: మండల కేంద్రంలోని రెండు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి 1.30 గంటల వరకు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎ.మహేష్‌బాబు గురువారం తెలిపారు. భువనశ్రీ ఫర్టిలైజర్స్, గుప్తా ట్రేడర్స్‌పై దాడులు నిర్వహించి, రెండు దుకాణాల్లోనూ స్టాకు వ్యత్యాసం గుర్తించామని చెప్పారు. కాల పరిమితి దాటిపోయిన పురుగు మందులను సీజ్ చేసి, అనుమతులు లేని పలు బయో కంపెనీల పురుగు మందుల అమ్మకాలను కూడా నిలుపుదల చేశామని చెప్పారు. రెండు దుకాణాల యజమానులపై 6ఏ కేసు నమోదు చేశామని చెప్పారు. రెండు షాపులలో రూ.15.68 లక్షల స్టాకు వ్యత్యాసం, రూ.3.36 లక్షల అనుమతులు లేని బయో పురుగు మందులు, రూ.1.13 లక్షల విలువైన కాల పరిమితి దాటిన మందులను గుర్తించామని చెప్పారు.

కానరాని చెత్త శుద్ధి!

- తెనాలిలో చెత్త సమస్యకు చెక్ పెట్టేలా గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం
- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్వాకంతో మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులు
- రెండేళ్లు దాటినా పట్టించుకోని అధికారులు
- కంపోస్ట్ యార్డు తరలింపుతో జటిలం కానున్న చెత్త సమస్య



పినపాడు గ్రామంలో మధ్యలో ఆగిపోయిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణ పనులు

తెనాలిఅర్బన్: పట్టణాలలో చెత్త సమస్యను పరిష్కరించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను కొందరు కాంట్రాక్టర్లు నీరు గార్చుతున్నారు. పట్టణంలో ఉత్పత్తి అయిన చెత్తను వేర్వేరు ప్రాంతాలలో నూతనంగా నిర్మించే గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లలో డంప్ చేసి అక్కడి నుంచి వాటిని గుంటూరులోని జిందాల్ సంస్థకు పంపాలనే ప్రతిపాదనలకు మధ్యలోనే బ్రేక్ పడింది. పనులను మధ్యలోనే నిలిపివేయటం, అధికారులు వాటిపై దృష్టి సారించకపోవటంతో తెనాలిలో చెత్త సమస్య మరింత జటిలం అయింది.

రెండేళ్లుగా నిలిచిపోయిన పనులు



ఆగిపోయిన పూలే కాలనీలోని నిర్మాణాలు

తెనాలి పట్టణంలోని పినపాడు హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద ఒకటి, కంపోస్ట్ యార్డు గేటు దగ్గర ఒకటి, పూలే కాలనీలోని ఎస్టీపీ ప్లాంట్ వద్ద మరోకటి నిర్మించేందుకు 2020లో అధికారులు అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. పినపాడులో రూ.32.50లక్షలు, కంపోస్ట్ యార్డులో రూ.16.41లక్షలు, పూలే కాలనీలో రూ.39.26 లక్షల పనులు పూర్తి అయ్యాయి. మిగిలిన పనులు నిలిచిపోయాయి. దీనికి కారణం ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధుల చెల్లింపులో జాప్యం చేయటమేనని తెలిసింది. ఆ తర్వాత నిధులు విడుదల కావటం..వారికి బిల్లులు చెల్లించటం జరిగింది. కానీ సదరు కాంట్రాక్టర్లు మిగిలిన పనులు చేసేందుకు ముందుకు రాలేదు. దీంతో అవి చెత్తతో నిండిపోయాయి. అలాగే పిల్లర్లకు ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లు కూడా తుప్పు పట్టి పనికిరాకుండా తయారు అయ్యాయి. కంపోస్ట్ యార్డులోని చెత్తను పూర్తిగా తొలగించి దానిని ఇతర అవసరాలకు ఉపయోగించాలనే భావనలో నేటి పాలకులు, అధికారులున్నారు. దీనిలో భాగంగా వాటి పనులు నేడు జరుగుతున్నాయి. కొద్ది నెలల్లో కంపోస్ట్ యార్డు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో నిర్మాణ దశలో ఉన్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లు చెత్త డంప్ చేయడానికి ఉపయోగపడే అవకాశం ఉంది. ఆదిశగా పాలకులు, అధికారులు ఆలోచన చేస్తే మేలు జరిగే అవకాశం ఉంది.

సత్ సంకల్పానికి తూట్లు..

తెనాలి పట్టణంలో తడి, పొడి, హానికర చెత్తలుగా విభజించి సేకరించటం జరుగుతుంది. పట్టణంలో ప్రతిరోజు సుమారు 80 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంటుంది. దీనిని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజు సేకరించి బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డుకు తరలిస్తుంటారు. దానిలో కొంత భాగాన్ని జిందాల్ సంస్థకు పంపుతారు. మిగిలిన చెత్తను అక్కడే డంప్ చేస్తుంటారు. దీని వల్ల వ్యర్థాల గుట్టలు పేరుకుపోయి కొండలా తయారై ఇబ్బందికరంగా మారాయి. ఇలాంటి పరిస్థితి రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలో ఉండటంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టణంలోని పలు శివారు ప్రాంతాలలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (చెత్త బదిలీ ప్రాంతం)ను నిర్మిస్తే చెత్త సమస్య చాలా వరకు పరిష్కారం అవుతుందని భావించారు. దీనిలో భాగంగా అన్ని మున్సిపాటీలలో వీటిని నిర్మించాలని ఆదేశించారు. వీటి నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. దీంతో అప్పటి మున్సిపల్ అధికారులు తెనాలి పట్టణంలో మూడు స్టేషన్‌ను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపారు. వాటిలో పినపాడు, బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో, పూలే కాలనీ ఉన్నాయి. ఒక్కో స్టేషన్ నిర్మాణం కోసం రూ.72.10లక్షల నిధులు వెచ్చించారు. తెనాలి పట్టణంలో నిర్మించే మూడు స్టేషన్‌లకు రూ.2.16కోట్లు వెచ్చించారు.



కంపోస్ట్ యార్డులోని నిర్మాణాలను కప్పేసిన చెత్త

కాంట్రాక్టర్‌లకు నోటీసులు ఇచ్చాం..



తెనాలి పట్టణంలోని మూడు ప్రాంతాలలో నిర్మిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల పనులు రెండేళ్ల నుంచి నిలిచిపోయాయి. నిధులు జమ అయినా కాంట్రాక్టర్‌లు పనులు పునః ప్రారంభించలేదు. పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌లకు నోటీసులు ఇచ్చాం. గతంలోని ఎస్ఆర్ రేట్లకు ప్రస్తుత రేట్లకు చాలా తేడా ఉందని, అందువల్ల కాంట్రాక్ట్ రద్దు చేయాలని కోరారు. దానిని మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లాం. కౌన్సిల్, ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

–ఆకుల శ్రీనివాసరావు, ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్, తెనాలి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



కొల్లిపర: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ప్రతిఒక్కరూ వీటిపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ సాల్మాన్‌రాజు అన్నారు. బాలల హక్కుల న్యాయవాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ విద్యార్థులకు బాల్య వివాహ వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా వీధి నాటక ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ చట్టబద్ధమైన వయసు వచ్చాకే ఆడపిల్లలకు తల్లిదండ్రులు వివాహాలు చేయాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం బి.వెంకటేశ్వర్లు, సీఆర్పీలు పి.మృత్యుంజయరావు, పి.రమేష్, శ్రీలత పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



తెనాలిటౌన్: పట్టణ సుందరీకరణలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నాజర్‌పేటలో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. సిబ్బందికి పారిశుద్ధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు విధిగా పాటించేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ప్రజలు వార్డుల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎక్కడ నిర్లక్ష్యం వహించకుండా శానిటేషన్ మెరుగుదలకు కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కిశోర్ రెడ్డి



కొల్లిపర: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బూత్ కమిటీల విభాగం ప్రధాన కార్యదర్శిగా కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండి కృష్ణ కిశోర్ రెడ్డి(కిట్టు) నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి తనకు ఉత్తర్వులు అందాయని కృష్ణ కిశోర్ రెడ్డి గురువారం తెలిపారు. కృష్ణ కిశోర్‌రెడ్డిని మండలంలోని పలువురు నాయకులు అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తెనాలిరూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అడ్వొకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్–2025 పై అభిప్రాయాలను ఈ నెల 28వ తేదీలోగా తెలియచేయవలసిందిగా కోరినందున, దేశవ్యాప్తంగా అన్ని స్టేట్ బార్ అసోసియేషన్‌ల పిలుపు మేరకు విధులను బహిష్కరించారు. అడ్వొకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్ 2025లోని 4, 9బి, 24ఎ, 24బి. 26ఎ, 35 ఏ, 45 బి 49 ఏ సెక్షన్‌లను సవరించటానికి కేంద్రం ప్రతిపాదన తయారుచేసిందని, ఈ యాక్ట్‌లో న్యాయవాద వృత్తికి ఉన్న స్వేచ్ఛను కాలరాయడమేనని న్యాయవాదులు ఆరోపించారు. ఈ యాక్ట్ అమల్లోకి వస్తే న్యాయవాదులు వారి వృత్తిలో అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. న్యాయవాదులపై జరుగుతున్న అకృత్యాలను పరిగణనలోకి తీసుకోకుండా, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న తొందరపాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, సెక్రటరీ హరిదాసు గౌరీశంకర్, బార్ అసోసియేషన్ సభ్యులు తాడిబోయిన శ్రీనివాసరావు, పి.ఆర్.వి.సాగర్, పిల్లి సుధాకర్, చిట్టాల మైకేల్, చింకా సురేశ్ చంద్ర యాదవ్, సోల శంకర్, జన్ను శివరాం, జంపని ఆదినారయణా, నాగళ్ళ హరీష్, అన్నం పిన్నారావు, ఆడక వేంకటేశ్వరావు, అల్లా విజయ కుమారి, పుణ్యవతి, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి



క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎండీ మురళీకాంత్

తెనాలిటౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనతో ముందుకు వెళ్లాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ పేర్కొన్నారు. స్థానిక బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పాల్గొని మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ తరువాత ఉండే వివిధ కోర్సులపై అవగాహన కల్పిస్తూ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు లక్ష్య సాధనతో ముందడుగు వేయాలని సూచించారు. గీతాకాంత్ మాట్లాడుతూ కృషి, పట్టుదల, అంకిత భావంతో కష్టపడి చదివితే గ్రామీణ విద్యార్థులు సైతం అద్భుత విజయాలు సాధించవచ్చని స్పష్టం చేశారు. ఈ విద్యాసంవత్సరం పలు క్రీడా, విద్యసంబంధ పోటీల్లో విజేతలు అయిన వారికి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.నాగశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మణరావును గెలిపించుకోవాలి



కొల్లిపరలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కొల్లిపర: రైతులు, రైతుకూలీలు, కార్మికులు, కష్టజీవులు, ఉద్యోగ, ఉపాధ్యాయ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుని తిరిగి శాసనమండలికి పంపించే బాధ్యత ఆయా వర్గాలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి రైతులకు పిలుపు ఇచ్చారు. గురువారం మండలంలోని కొల్లిపర, మున్నంగి, తూములూరు గ్రామాల్లో ప్రజా సంఘాల కార్యకర్తలతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావు గెలుపు కోసం విస్తృతంగా కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుగ్గిరాల శుభమహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో రైతులు గత 13సంవత్సరాలుగా నిలువ చేసుకున్న రూ.100 కోట్ల విలువైన పసుపు దగ్ధమైతే అప్పుడు ఎమ్మెల్సీగా ఉన్న లక్ష్మణరావు జోక్యం చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తాను ఒక్కడే ముందుండి రైతులను నడిపించిన సంఘటనను ఒక్కసారి రైతులు గుర్తుకు చేసుకోవాలన్నారు. గతంలో 42 రోజులపాటు అంగన్‌వాడీలు చేసిన ఆందోళన సందర్భంగా ఆయన ప్రత్యక్షంగా పాల్గొనటమే గాక ప్రభుత్వంతో కూడా సంప్రదించి ఆరు రకాల జీఓలు తీసుకొచ్చి వారిని నిలబెట్టారని పేర్కొన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల్లో నిరుద్యోగులకు గ్రూప్ వన్, టూ, డీఎస్సీకి సంబంధించి ఉచితంగా కోచింగ్ సెంటర్లు నిర్వహించి వారికి మెరుగైన ఉద్యోగాలు వచ్చేలా కృషి చేసిన లక్ష్మణరావును తిరిగి శాసన మండలికి పంపించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆయనవెంట సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖరరావు, రైతులు, యువత ఉన్నారు.

మహిళల హ్యాండ్‌బాల్ విజేత జేఎంజే కాలేజీ



తెనాలి: స్థానిక జేఎంజే మహిళా కాలేజీలో జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహిళల హ్యాండ్‌బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ పోటీల్లో విన్నర్స్‌గా తెనాలిలోని ఆతిథ్య జేఎంజే మహిళా కాలేజీ విజయం సాధించగా, పట్టణానికే చెందిన ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ రన్నర్స్ స్థానాన్ని గెలుచుకున్నారు. బాపట్లలోని బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ జట్టు తృతీయస్థానంలో నిలిచింది. బహుమతి ప్రదానోత్సవంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, కోచ్ నాగరాజు, సీఈఓ వెంకటేశ్వరరావు, వివిధ కాలేజీల వ్యాయామ అధ్యాపకులు వేలాంగిణి రెడ్డి, రవీందర్, కాలేబ్, ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుశీలమ్మ, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. జేఎంజే కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీ, వ్యాయామ అధ్యాపకురాలు అరుణ సుజాత పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: సోదరి చనిపోయిందని మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలి రామలింగేశ్వరపేటకు చెందిన వడ్డి రవితేజ(32) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు భార్య, పది నెలల కుమారుడు ఉన్నారు. 2020లో కరోనాతో రవితేజ సోదరి పావని మృతిచెందింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన రవితేజ నిత్యం బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 17న హైదరాబాద్ వెళుతున్నానని చెప్పి గుంటూరు వచ్చి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అశ్విని లాడ్జిలో రూము అద్దెకు తీసుకుని పురుగు మందు తాగాడు. గురువారం గమనించిన లాడ్జి నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బాధితుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి బావ మోపిదేవి రాగమానీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

తెనాలిరూరల్: మండల గ్రామం బుర్రిపాలెంలోని గ్రామ సచివాలయాన్ని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి వస్తున్న అర్జీలు, వాటి పరిష్కారం గురించి సిబ్బందిని ప్రశ్నించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

బోధనా సామర్థ్యం పెంపుదలకు శిక్షణ దోహదం



మాట్లాడుతున్న ఎంఈఓ



శిక్షణ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు

తెనాలిటౌన్: బోధనా సామర్థ్యంతోపాటు నిర్మాణాత్మక ఆటలు పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ జయంతిబాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతిపై ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎస్ఎంహెచ్, కొత్తపేటలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల ప్రాథమిక అభ్యాసనాన్ని మెరుగుపరచడానికి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయని ఎంఈఓ తెలిపారు. జ్ఞాన జ్యోతి ప్రోగ్రామ్ కింద 120 రోజుల పాటు శిక్షణ ఇచ్చి అనంతరం సర్టిఫికెట్స్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు రానున్న రోజుల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తల్లి తరువాత అంగన్‌వాడీ కార్యకర్తలే పిల్లలను తల్లిలా లాలిస్తూ పాఠాలు చెప్పాలని సూచించారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలను అంగన్‌వాడీ స్కూళ్లలో అమలు చేయాలని సూచించారు. శారీరక, భాష, మేధావృద్ధి, సృజనాత్మకత, సామాజిక భావోద్వేగ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. సీడీపీఓ డాక్టర్ కె.సునీత, డీఆర్‌పీలు కె.సౌజన్య, రామరాజు, సీఆర్ఎంటీలు సీహెచ్ శ్రీదేవి, దీపాంజలి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకట పవన్‌కుమార్‌కు అభినందనలు

స్మార్ట్‌ఫోన్, నూతన వస్త్రాలు బహూకరించిన 'మానవత'



పవన్‌కు స్మార్ట్‌ఫోన్, నూతన వస్త్రాలు అందజేసిన మానవత సంస్థ బాధ్యులు

తెనాలి: నిరుపేద కుటుంబంలో జన్మించి, రోజూ కాలినడకన కాలేజీకి వెళ్లి వస్తూ ఇంటర్మీడియట్ చదువుతున్న వివేక జూనియర్ కాలేజీ విద్యార్థి తూనుగుంట్ల వెంకట పవన్‌కుమార్‌కు తొలి ప్రయత్నంలోనే జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్‌లో 99.37 పర్సెంటైల్ సాధించటంపై మానవత స్వచ్ఛంద సంస్థ హర్షం వ్యక్తంచేసింది. ఆ పేదింటి ప్రతిభావంతుడి పైచదువులకు అవసరమైన స్మార్ట్‌ఫోన్‌తోపాటు నూతన వస్త్రాలు, బూట్లు అందజేశారు. గురువారం సాయంత్రం ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, పవన్‌కుమార్ భవిష్యత్‌లో యువతకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్న ఆకాంక్షను వ్యక్తంచేశారు. సంస్థ అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్ మాట్లాడుతూ పవన్‌కుమార్ సాధించిన విజయం తెనాలికి గర్వకారణమన్నారు. వివేక జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కొడాలి బ్రహ్మం, వివేక డీన్ నన్నపనేని సునీల్ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు వెంకట పవన్‌కుమార్ చేసిన కృషిని వివరించారు. సంస్థ కార్యదర్శి పి.వెంకట్, పి.వాసు డీవీ సోమయ్యశాస్త్రి, ఎస్‌వీ శర్మ, చదలవాడ సాంబశివరావు, ఆలపాటి వెంకట్రామయ్య, రాజశేఖర్‌రెడ్డి, రోహిని మురళీ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకొనేలా చైతన్య పరచాలి

దుగ్గిరాల: పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేలా చైతన్య పరచాలని అధికారులకు డిప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మికుమారి సూచించారు. గురువారం డాక్టర్ కేఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్ లక్ష్మికుమారి పాల్గొని మాట్లాడారు. మంచి సమాజం కోసం మంచి నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తహసీల్దార్ ఐ.సునీత మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ కొత్త గిరిధరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కె.రమాదేవి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.రాంబాబు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి శివాలయం సెంటర్ వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. శివాలయం కూడలిలో మానవహారంగా ఏర్పడి పట్టభద్రులు అంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని నినాదాలు చేశారు. డిప్యూటీ కలెక్టర్ ఎ.లక్ష్మికుమారి అధికారులచే ప్రతిజ్ఞ చేయించారు.

అరవపల్లి మార్గంలో పారిశుద్ధ్య చర్యలు



రోడ్డు పక్కన చెత్త నిల్వలను తొలగిస్తున్న సిబ్బంది

రేపల్లె రూరల్: రేపల్లె నుంచి అరవపల్లి వెళ్లే రోడ్డును గురువారం స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రపరిచారు. మహా శివరాత్రి సందర్భంగా అరవపల్లి వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం కావడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. రహదారికి ఇరువైపులా చెత్తను పడేయొద్దని, పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. తిరునాళ్ల నాటికి ఎన్నికల కోడ్ కొనసాగుతుందని, రహదారికి పక్కన భక్తులు ఏర్పాటు చేసుకునే ఫ్లెక్సీల్లో రాజకీయ నాయకుల బొమ్మలు లేకుండా చూసుకోవాలన్నారు. రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం, పిచ్చిచెట్లను తొలగించారు. ప్లొక్లయిన్‌తో గుంతలను సరిచేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.